క్లుప్తంగా

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు



భిక్కనూరు: ఇళ్లు లేని నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి, లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి లింబాద్రి, సచివాలయ కార్యనిర్వాహక అధికారి మహేష్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మద్దూరి రవి, నాయకులు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో భువన్ సర్వే



బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న 100 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం మున్సిపల్ అధికారులు భువన్ సర్వే చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కొలతలు చూసి పన్నులు వేశారు. పన్నులు చెల్లించని ఇంటి యజమానులకు నోటీసులు ఇచ్చారు. అనుమతులు లేకుండా అంతస్తులు నిర్మించిన వారికి నోటీసులు అందజేసినట్లు మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.

సామగ్రి కొనుగోలుకు విరాళం అందజేత

దోమకొండ: సంఘమేశ్వర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఫర్నిచర్ కొనుగోలుకు గ్రామానికి చెందిన సురభి అర్జున్‌రావ్ బుధవారం రూ.10 వేలు విరాళంగా అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం రాజ్ కుమార్ తెలిపారు. దాత అర్జున్‌రావ్ స్వయంగా పాఠశాలను సందర్శించి సామగ్రి కొనుగోలుకు నగదును విరాళంగా అందించారని ఆయన వివరించారు.

కొలతల ప్రకారం పనులు చేపట్టండి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఉపాధి హామీ పథకంలో కూలీలకు కొలతల ప్రకారం పనులు కల్పించి, తగిన వేతనం చెల్లించాలని క్వాలిటీ కంట్రోల్ అధికారి విప్లవ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి హామీ సిబ్బందికి ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏపీవో సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ



మద్నూర్(జుక్కల్): తడిహిప్పర్గాలో బుధవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను తహసీల్దార్ ముజీబ్ స్వీకరించారు. భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ముజీబ్ అన్నారు. గ్రామంలో 20 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

భిక్కనూరులో 4,155 దరఖాస్తులు..

భిక్కనూరు: మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలపై 4,155 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ సునీత తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తులను ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. త్వరలో వాటిని పరిశీలించి రైతులకు తగిన న్యాయం చేస్తామన్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రహ్మాజీవాడి శివారులో గల కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేనివారితో పాటు సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించని వారికి జరిమాన విధించారు. పెండింగ్ చలానా డబ్బులు కట్టేలా చర్యలు తీసుకున్నారు. ఎస్సై మురళీ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడిపినట్లయితే కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిస్తామని హెచ్చరించారు. ఓవర్ స్పీడ్‌గా నడపొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారికి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పనుల నిర్మాణాన్ని ప్రారంభించారు. మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు జగ్గ బాల్‌రాజు, మాజీ ఎంపీటీసీ పాపనొల్ల బీరయ్య పాల్గొన్నారు.

మూగజీవాలకు అందని వైద్యం

- సిబ్బంది కొరతతో పశుపోషకులు సతమతం
- మందుల లేమి.. ఉన్న సిబ్బంది సైతం నిర్లక్ష్య ధోరణి
- పట్టించుకోని ఉన్నతాధికారులు, ప్రభుత్వం



మద్నూర్‌లో అరకొరగా ఉన్న మందులు



మద్నూర్‌లో మంగళవారం మూసి ఉన్న పశువైద్యశాల

మద్నూర్(జుక్కల్): ప్రభుత్వం, ఉన్నతాధికారులు పశువైద్యశాలలపై పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో మూగజీవాలకు వైద్యం అందడం లేదని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రతి సంవత్సరం పశువులు వ్యాధుల బారిన పడి మృతిచెందుతున్నాయి. మద్నూర్ ఉమ్మడి మండలంలో మద్నూర్, మేనూర్, డోంగ్లీలో పశువైద్యశాలలున్నాయి. ఏ ఒక్క పశువైద్యశాలలో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా ఈ ఆస్పత్రులకు ఉన్నతాధికారులు మందులు సక్రమంగా సరఫరా చేయకపోవడం మరో సమస్యగా మారింది. ఉన్న సిబ్బంది సైతం సక్రమంగా విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మద్నూర్ మండల కేంద్రంలో మంగళవారం(జూన్ 17) పశువైద్యశాలకు తాళం వేసిన దృశ్యం దర్శనమిచ్చింది. మద్నూర్ పశు వైద్యశాలలో ఒక ఏడీ, వెటర్నరీ అసిస్టెంట్, ఓఎస్ విధులు నిర్వహించాలి. ఏడీ పోస్టులో బిచ్కుంద ఏడీగా ఉన్న భాస్కరస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. వెటర్నరీ అసిస్టెంట్ సునీత, ఓఎస్ అలీమ్ విధులు నిర్వహిస్తున్నారు. ఉన్న ఇద్దరు సిబ్బంది సమయానికి రాక, ఒక్కోసారి పశువైద్యశాలకు రాకపోవడంతో తాళం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. బిచ్కుందలో ఏడీగా ఉన్న భాస్కరస్ మద్నూర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పడంతో అప్పుడప్పుడు వీలును బట్టి మద్నూర్‌లో పశువులకు వైద్యం అందిస్తున్నారు. ఆరు నెలలుగా ప్రభుత్వం పశువుల కోసం మందులు పంపిణీ చేయకపోవడంతో ఉన్న మందులతోనే సరిపెడుతున్నామని సిబ్బంది చెబుతున్నారు.

నట్టల నివారణ మందులు రాక ఏడాది అవుతోందని రైతులు పేర్కొంటున్నారు. మేనూర్ పశు వైద్యశాలలో ఒక వైద్యుడు, డోంగ్లీ పశువైద్యశాలలో ఎల్ఎస్ఏ పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఈ విషయమై మంగళవారం ఇన్‌చార్జి ఏడీ భాస్కరస్‌కు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఆస్పత్రికి తాళం వేసి ఉంది



నా దగ్గర ఆవులు, గేదేలున్నాయి. ఆస్పత్రికి వస్తే తాళం వేసి ఉంది. మద్నూర్ పశువైద్యశాలలో వైద్యుడు లేరు. పశువులు అనారోగ్యానికి గురైనపుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆవులు, గేదెలను నమ్ముకొని జీవిస్తున్న తమకు వాటికి అనారోగ్యం కలిగితే ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి వస్తోంది. సరిహద్దులోని దెగ్లూర్‌కు పశువులను తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్నాం.

– పండరి, రైతు, హండెకేలూర్

మందులే దొరకడం లేదు



మా ఇంట్లో ఆవులు, గేదేలు, ఎడ్లు ఉన్నాయి. అవి అనారోగ్యానికి గురైతే మద్నూర్ పశువైద్యశాలకు తీసుకెళ్తా. కాని అక్కడ సిబ్బంది మాత్రమే వైద్యం చేస్తున్నారు. ఆస్పత్రిలో అసలు మందులే లేవు. దీంతో డబ్బులు వెచ్చించి అందుబాటులో ఉన్న వైద్యులతో చికిత్స అందిస్తున్నాను.

– శ్యామ్, రైతు, మద్నూర్

సిబ్బంది కొరత వాస్తవమే

పశువైద్యశాలలో సిబ్బంది, మందుల కొరత ఉంది. ఉమ్మడి మండలంలో పశువైద్యశాలలకు మందుల సరఫరా సరిగ్గా లేదని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఆస్పత్రికి వచ్చిన పశువులకు చికిత్స చేస్తున్నాం. మా ఆస్పత్రిలో ఒక వైద్యుడి పోస్టు ఐదేళ్లుగా ఖాళీగా ఉంది. నట్టల నివారణ మందుల సరఫరా తక్కువగా ఉంది.

– వినీత్, పశువైద్యుడు, డోంగ్లీ

కళాశాల బీబీపేటలోనే కొనసాగించాలి



బీబీపేట: బీబీపేటలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను గ్రామంలోనే కొనసాగించాలని ఎట్టి పరిస్థితుల్లో దోమకొండకు తరలించొద్దని కళాశాల సాధన సమితి సభ్యులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. ఎన్నో ఆందోళనలు, పోరాటాల ద్వారా సాధించుకున్న జూనియర్ కళాశాల అసలు ఉన్నట్టా, లేనట్టా అని ప్రశ్నించారు. అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు నష్టపోకుండా కళాశాల ఇక్కడే కొనసాగించేందుకు అందరూ ఏకం కావాలన్నారు. లేకుంటే విద్యార్థులతో కలిసి మరో ఉద్యమం తప్పదని పేర్కొన్నారు. కళాశాల సాధన సమితి సభ్యులు డాక్టర్ సంతోష్ గౌడ్, దేవునిపల్లి దేవరాజ్, శ్రీకాంత్, పృథ్వీరాజ్, భూమయ్య, కిరణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టె శుభ్రం



సాక్షి ఎఫెక్ట్..

నస్రుల్లాబాద్: ‘డ్రైనేజీని తలపిస్తున్న నీటి తొట్టెలు’ శీర్షికతో సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో సూర్యకాంత్ అంకోల్‌తండాలో గ్రామ పంచాయతీ సిబ్బందిని పంపించి నీటి తొట్టెను శుభ్రం చేయించారు. చుట్టూ ఉన్న గడ్డిని తొలగించడమే కాకుండా నిత్యం బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ పశువుల నీటి తొట్టెను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

మహిళలను వేధిస్తే షీటీంకు సమాచారమివ్వాలి



ఎల్లారెడ్డి: మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే షీటీం సభ్యులకు వెంటనే సమాచారం అందించాలని షీటీం సభ్యులు శ్రీనివాస్, సుప్రజలు సూచించారు. బుధవారం ఎల్లారెడ్డిలో ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరస్తుల నుంచి జాగ్రత్తగా ఉండాలని అన్నారు. బాలికలను ఎవరైనా వెంట పడి ఇబ్బందులు పెడితే షీటీంకు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు.

గందరగోళంగా పాఠశాల తరలింపు

- బాలుర పాఠశాలలోకి బాలికల పాఠశాలను మార్చిన అధికారులు
- జూనియర్ కళాశాల కోసం బాలికల పాఠశాల భవనం కేటాయింపు
- మా పాఠశాల మాకు కావాలని ఆందోళన చేస్తున్న బాలికలు
- తలలు పట్టుకుంటున్న ఇరు పాఠశాలల హెచ్‌ఎంలు, సిబ్బంది



రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహిస్తున్న బాలికల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు(ఫైల్)

బీబీపేట: మండలం కేంద్రంలో విద్యా వ్యవస్థ ఈ ఏడాది గందరగోళంగా తయారైంది. ప్రశాంతంగా నడుస్తున్న బాలికల పాఠశాల విద్యార్థినులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బాలికల పాఠశాలను బాలుర పాఠశాలకు తరలింపు, కళాశాల కోసం బాలికల పాఠశాలను కేటాయించడం పట్ల అటు బాలికల పాఠశాల విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు గత అయిదు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. బీబీపేటలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల 1965లో ప్రారంభించారు. ముందుగా పాఠశాలలో ప్రాథమిక పాఠశాల నడిచేది. 1993 సంవత్సరంలో బాలికల ఉన్నత పాఠశాలగా మారింది. బీబీపేటలో 2023లో అప్పటి ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయడంతో స్థానిక టీఎస్ఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఒక సంవత్సరం పాటు కళాశాల కొనసాగింది. అయితే ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 650 పెరగడంతో పాటు పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయనే ఉద్దేశంతో అందులో కళాశాల వద్దని మార్చేశారు. దీంతో కళాశాలకు గదులు లేకపోవడంతో దోమకొండ కళాశాలకు అటాచ్ చేస్తూ 2024లో నోడల్ అధికారి ఉత్తర్వులు జారీ చేయడంతో కళాశాల విద్యార్థులు దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లారు. అయితే ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభం కావడం, కళాశాలకు సిబ్బంది పూర్తి స్థాయిలో రావడంతో కళాశాల ప్రస్తావన ముందుకు వచ్చింది.

తలనొప్పిగా మారిన గదుల కేటాయింపు

స్థానిక టీఎస్ఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో సుమారు 650 మంది విద్యార్థులు ఉండగా వారికి సరిపడేలా మాత్రమే గదులు అందుబాటులో ఉన్నాయి. దీంతో కళాశాలను గత సంవత్సరం అందులో నుంచి తీసివేశారు. ఇప్పుడు అందులోకి బాలికల ఉన్నత పాఠశాలను మార్చుతూ ఉత్తర్వులు రావడంతో 129 మంది బాలికలకు గదులు కేటాయించడం తలనొప్పిగా మారింది. ఒకవేళ గదులు ఇచ్చినా అందులో రెండు పాఠశాలలు కొనసాగడం ఎలా అనేదే ప్రశ్నార్థకంగా మారింది. మండలంలో ఏకైక బాలికల పాఠశాల ఉండడంతో బాలికలు అడ్మిషన్ పొందారు. ఇప్పుడు పాఠశాల భవనాన్ని బాలుర పాఠశాలలోకి మార్చడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు. అంతే కాకుండా ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేశారు. బాలుర పాఠశాలలోకి మార్చితే ఇబ్బందులు తలెత్తుతాయని ఆడపిల్లల భవిష్యత్తుపై ప్రభావం చూపెడుతుందని ఆందోళన చెందుతున్నారు. కళాశాల కోసం 129 మంది విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కళాశాలకు మరెక్కడికైనా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

యథావిధిగా ఉంచాలి



బాలికల పాఠశాలను బాలుర పాఠశాలకు తరలించొద్దు. ఒకవేళ అధికారులు అలా చేస్తే మాకు టీసీలు ఇస్తే ఎక్కడైనా ఉన్న బాలికల పాఠశాలకు వెళ్తాం. మా భవిష్యత్తు కోసం అధికారులు మళ్లీ ఒకసారి పునరాలోచించాలి.

– ప్రవళిక, 9వ తరగతి, బాలికల పాఠశాల, బీబీపేట

సంక్షిప్తం

అవకాశాలను అంది పుచ్చుకోవాలి

మాచారెడ్డి: విద్యార్థులు పదవ తరగతి తర్వాత అవకాశాలను అంది పుచ్చుకోవాలని ఎస్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ సేవా సైనిక్ అక్షిత సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటాచారికి విద్యార్థులకు ఉపయోగపడే బ్రోచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు పదవతరగతి తర్వాత వృత్తి విద్య అవకాశాలు, ఐఐటీ, నీట్ పోటీ పరీక్షలకు దిశానిర్దేశం చేశారు.

ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలి

భిక్కనూరు: ఇంటి పన్నులపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి సూచించారు. బుధవారం సిద్ధిరామేశ్వరనగర్ గ్రామ సచివాలయాన్ని అయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 100 శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి అఖిల, సిబ్బంది ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

మాచారెడ్డి: ఇటీవల అస్వస్థతకు గురైన కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను బుధవారం ఘన్‌పూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. నాయకులు మల్లేష్ యాదవ్, సుదర్శన్ గౌడ్, శ్రీనివాస్, దయాకర్ రావు, రాజేందర్, రాజు, బెస్త మల్లేష్, రమేష్, స్వామి గౌడ్, దేవయ్య తదితరులున్నారు.

ముదిరాజ్ కల్యాణ మండపానికి రేకుల అందజేత

దోమకొండ: అంబారిపేటలో నూతనంగా నిర్మిస్తున్న ముదిరాజ్ సంఘం కల్యాణ మండపానికి బుధవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి.. రేకులను అందజేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రేకులను అందజేసినట్లు వివరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లింగంపేట(ఎల్లారెడ్డి): పోల్కంపేటలో బుధవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల కో–ఆర్డినేటర్ నాగరాజు ప్రారంభించారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు సీఆర్ఆర్(ఎస్‌డిఎఫ్) నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు చాకలి కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సంజీవరెడ్డి, కృష్ణమూర్తి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

మురికి నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: గ్రామాలలో మురికి నీటి నిల్వలు ఉండకుండా తగిన చర్యలను తీసుకోవాలని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతి కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురికి నీటి కాలువలలో ఆయిల్‌బాల్స్ వేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించని వారి నుంచి నాట్ విల్లింగ్ లెటర్ రాయించుకోవాలని తెలిపారు. ఉచిత ఇసుక కోసం తహసీల్ కార్యాలయానికి వారి వివరాలను పంపాలని అన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో ప్రవీణ్ కుమార్ సూచించారు.బుధవారం బేగంపూర్ తండా, వడ్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు.

నేటి చిత్రం



గుర్తించకపోతే.. పడిపోతారు

నిజాంసాగర్(జుక్కల్): ఆరేడ్ గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద ప్రధాన రోడ్డుపైన గుంత ప్రమాదకరంగా ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి మాదపల్లి గ్రామానికి సాగు నీరందించే పంటకాలువ కల్వర్టుపై గుంత ఏర్పడింది. రాత్రివేళ ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా బోల్తాపడటం ఖాయం. గుంతను పూడ్చాలని గ్రామస్తులు పలుమార్లు నీటిపారుదల శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇకనైనా స్పందించి గుంతను పూడ్చాలి. – సాయిలు, ఆరేడ్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక



ఆటల పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

గాంధారి(ఎల్లారెడ్డి): హకీంపేట్ క్రీడాపాఠశాలలో ప్రవేశాలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులను ఎంపిక చేసినట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. 20 మంది విద్యార్థులు హాజరు కాగా ..మంచి ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంఈవో శ్రీహరి, పీఈటీలు లక్ష్మణ్, సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగంపేటలో నేడు ఎంపిక పోటీలు

లింగంపేట(ఎల్లారెడ్డి): క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పోటీలను గురువారం లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి షౌకత్అలీ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఎంపికైన వారిని తెలంగాణ స్పోర్ట్స్ స్కూళ్ల(హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్)లో ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటల లోపు రావాలని సూచించారు.

ప్రయివేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు అమ్మొద్దు



మాట్లాడుతున్న ఎంఈవో రామస్వామి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రయివేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, స్కూల్‌బ్యాగులు, టై, బెల్టులు అమ్మవద్దని ఎంఈవో రామస్వామి హెచ్చరించారు. తాడ్వాయి విద్యా వనరుల కేంద్ర భవనంలో బుధవారం ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కమిటీని ఏర్పాటు చేసి ఆ కమిటీ తీర్మానం లేకుండా విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేయవద్దన్నారు. ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలకు సంబంధించిన ఆన్‌లైన్ వివరాలను ఎప్పటికప్పుడు పొందుపరుచుకొని అడిగిన వెంటనే రిపోర్టులను ఎంఈవో కార్యాలయానికి అందజేయాలని సూచించారు.

విద్యార్థినులతో కలిసి కలెక్టర్ భోజనం



భోజనం చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఇతర అధికారులు

బాన్సువాడ రూరల్: మండలంలోని కొయ్యగుట్ట తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తనిఖీ చేశారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ఆయన విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వారితోనే కలిసి డైనింగ్‌హాల్‌లో మధ్యాహ్న భోజనం చేశారు. తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం, నాణ్యమైన విద్య అందించాలని ప్రిన్సిపల్ లక్ష్మీబాయిని ఆదేశించారు. అంతకు ముందు తిర్మలాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ అప్‌గ్రేడేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. చిన్నారులు కలెక్టర్‌కు పూలతో స్వాగతం పలుకగా ఆయన వారితో పాటలు పాడించి, బొమ్మలను చూపిస్తూ వాటి పేర్లు చెప్పమని సూచించారు. సామూహిక అక్షరభ్యాసం చేయించారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, డీఈవో రాజు, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి దయానంద్, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో ముజాహిద్, సూపర్‌వైజర్ సౌభాగ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



పెద్దకొడప్‌గల్ ఉర్దూ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులకు బుధవారం ఇన్‌చార్జి ఉపాధ్యాయురాలు రుక్సానా అంజుమ్, స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఉర్దూ స్కూల్ చైర్మన్ ఎండీ యాకుబ్, నాయకులు చిప్ప మోహన్, కల్లూరి పండరి, సంజీవ్, బస్వరాజ్ దేశాయ్, జాఫర్ షా తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి అర్బన్: స్థానిక ఎన్‌జీవోస్‌కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలను ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు అందజేశారు. సూర్యాపేటకు చెందిన వాసా జానయ్య, వీరమ్మ, భవిరిశెట్టి విశాలాక్షి జ్ఞాపకార్థం ఐవీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసా రాజేంద్రప్రసాద్ రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల నోటు పుస్తకాలను వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తుండగా కామారెడ్డికి పంపిన నోటు పుస్తకాలను ఎన్‌జీవోస్ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అందజేస్తున్నట్టు బాలు పేర్కొన్నారు. ప్రతినిధులు ఎర్రం చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సదాశివనగర్‌లో దుస్తులు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ భీరయ్య, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాజేందర్, హెచ్‌ఎం రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.